

# అస్వతంత్రుడు

★ నిట్టల శ్రీరామమూర్తి ★

ఎంత నిర్భాగ్యమైందీ తన జీవితం! ఈవిధంగా జీవితం గడపటకన్నా చస్తేనే మేలనిపిస్తోంది. తన దారిద్ర్యమే కదా వాళ్లు తన్నులోకువ పరచ డానికి కారణమైంది. తన నాన్నే బ్రదికివుంటే తన జీవితం ఇల్లా గడచిఉండేదా?

తనకు జ్ఞానం రాకపూర్వమే నాన్న చచ్చి పోయాడు. నాన్న ఎల్లా ఉండేవాడో? నాన్నని చూడాలని అనిపిస్తుంది. కాని తన నాన్న తనకి లేడు.

ఈ ఆధారం లేకపోబట్టి కదా తనూ అమ్మా వాళ్ల మీద ఆధారపడి ఉండాల్సి వచ్చింది? తన మామయ్యకీ, అతని సంతానానికీ తమంటే ఎందుకూ అంత ఈసడింపు? అమ్మనీ, తననీ ఊరికే పోషిస్తున్నామనీ, తాము కష్టపడి సంపా దించిన సొమ్ములో కొంత మాకోసం ఖర్చు పెట్టుతున్నామనీ కదా వారికి అహంభావము? నిజంగా అల్లాగే అయితే బాధలేదు.

కాని తన నాన్న ఆస్తి అంతా కాజేసి పైగా మామయ్య దిక్కులేని తమ్ముని హేయంగా చూస్తున్నాడు. అతన్ని అడిగేవా రెవరు?

పాపం, అమ్మ ఎంత కష్ట పడుతోందో కదా మంచిగా కలగజేసికొని ఇంట్లో వెట్టి చాకిరీ అంతా చేస్తుందే. సరియైన తిండేనా పెట్టరే ఆమెకు? ఆమె దుస్థితిచూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది.

నాన్నతోపాటు ఆమెకూడా చచ్చివుంటే బాగుండు ననిపిస్తుంది. తనకోసం కదా ఆమె అంత శ్రమ పడుతూ కూడా ప్రాణాలు నిల్పు కొనివుంది? చూస్తూ తనేమీ చేయలేక పోతు న్నాడు. అయినా తను పద్దెనిమిది ఏళ్ళ ప్రాయం లో ఏం ఉద్యోగం సంపాదించ కలడు? అమ్మని ఏం పోషించ కలడు?

కాలేజీలో స్కాలర్‌షిప్ యిస్తున్నారు కాబట్టి సరిపోయింది కాని ఆ జీతం కూడా కట్టవలసి వస్తే వాళ్లు మరీ ఏడ్చేవారు. అసలు తనకా చదువులేకుండా మొద్దుగా అట్టే పెట్టే వారేమో!

బావకి ఎంత గర్వం? తన నెప్పుడూ కూడా ఎక్కడికీ తీసికెళ్లలేదు. తీసుకువెళ్తే మర్యాదకు లోటుట. తన సొసైటీకి నేను తగనట. అతను పాతవని వదిలేసిన లాగులు, చొక్కాలు తనకు ఇచ్చేరేకాని ఒక్క క్రొత్త బట్ట ఇచ్చిన పాపాన్ని పోలేదు.

స్నేహితులే నయం. తన అవస్థకు కనికరించి కూడా ఇళ్లకు తీసుకుపోయి మర్యాద చేసేవారు. ఓదార్చేవారు.

తనకి క్లాసులో ఫస్టు మార్కులు వస్తున్నా యని బావకి అసూయ. ఈ ఓర్వలేమిచేత ఇంకోవంక పెట్టి తన్ను మరీ హీనపరచాలని చూసేవాడు.

తను వారికి అడ్డుచెప్పకుండా తలయొగ్గి మౌనంవహించడం వారికి మరీ కోపం.

తన పిల్లలతో సమానంగా అన్నం పెట్టిన పాపాన్ని పోలేదు, ఆ మహాయిల్లాలు మేనత్త.

తనకాస్థితి దుర్భరమైపోతోంది. ఎల్లాగైనా వారినుండి దూరంగాపోయి ఉందామనిపిస్తోంది. కాని పోషించుకోగల శక్తిలేదు.

కన్నీళ్లు కారుస్తూ, సుఖమనే దేమిటో ఎరక్క ఇల్లాగ అమ్మ దీనావస్థనుకూడా చూస్తూ, కృశించ వలసిందేనా?